క్లుప్తంగా

రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

పుల్లలచెరువు: గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వోలు అప్రమత్తంగా ఉంటూ రెవెన్యూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే సక్రమంగా చేయాలని, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోతే సమస్యలు వస్తాయని, విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. కవలకుంట్ల వీఆర్వో వాసు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ముటుకుల వీఆర్వో కృష్ణకు షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఈయన వెంట మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, తహసీల్దార్ దాసు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ కృష్ణారెడ్డిపల్లి, రేగుమానిపల్లి, ఎస్సీ కాలనీ, గుర్రాలమడుగు బీసీ కాలనీల్లో శనివారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొంటారన్నారు.

కుక్కలు పట్టివేత

దొనకొండ: మండలంలోని పడమటి లక్ష్మీపురంలో విచ్చలవిడిగా కుక్కలు సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి వరికూటి నాగార్జున శుక్రవారం రెండు రోజుల నుంచి కుక్కలు పట్టే కార్యక్రమం చేపట్టారు. సుమారు 200 కుక్కలు పట్టుకుని ఆటో ట్రాలీలో అడవిలో వదిలేశారు. వెంటనే స్పందించిన పంచాయతీ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

తాళ్లూరు: మండలంలోని గుంటి గంగ సమీపంలో శుక్రవారం పేకాట స్థావరంపై ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ తన సిబ్బందితో అకస్మికంగా దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి నుండి రూ.1,07,780 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట స్థావరం వద్ద 11 బైక్‌లను సీజ్ చేశారు.

మాధవరం సర్పంచి రేణుక భర్త మృతి



నివాళులర్పిస్తున్న మద్దిశెట్టి రవీంద్ర

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ బీసీ సంఘ నాయకుడు, మాధవరం సర్పంచి తాటికొండ రేణుక భర్త ఏడుకొండలు (45) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్‌పీ నాగార్జునరెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పలు గ్రామాల సర్పంచ్‌లు వలి, పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, కేవీ పాలెం జేసీఎస్ కన్వీనర్ కొర్రపాటి విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న కరిముల్లా, ఉత్తమ్

మార్కాపురం టౌన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కోడిరామమూర్తి క్రీడ, నటశిక్షణ సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న 125 మంది విద్యార్థులకు శుక్రవారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కరిముల్లా, 11వ వార్డు ఇన్చార్జ్ ఉత్తమ్ కుమార్ అల్పాహారం అందజేశారు. చిన్నారుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్న సేవా సంఘానికి తమ వంతు బాధ్యతగా అల్పాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాద్యం వేణు, కాళంగి శ్రీనివాసులు, మహేష్, గంగిశెట్టి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీపై కిసాన్ డ్రోన్‌లు

త్రిపురాంతకం: రైతు మిత్ర గ్రూపులకు కిసాన్ డ్రోన్‌లను 50 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు వ్యవసాయాధికారి కె.నీరజ తెలిపారు. మండలంలోని సోమేపల్లిలో క్షేత్ర స్థాయిలో కిసాన్ డ్రోన్‌లతో మందు పిచికారీ చేసే విధానంపై ప్రదర్శన నిర్వహించారు. ఆసక్తి ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు నీరజ తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో కాంతులు



మార్కాపురం డ్రైవర్స్ కాలనీలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



రేగుమానిపల్లి పంచాయతీలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

● గడప గడపలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

కొనకనమిట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల నవరత్నాల పథకాలు పేద ప్రజల జీవితాల్లో సంక్షేమ కాంతులు నింపుతున్నాయని ఎమ్మెల్యే కేపీ.నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని రేగుమానిపల్లి పంచాయతీ మర్రిపాలెం, బీసీ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీ కృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచ్ బోయిన వెంకటేశ్వర్లుయాదవ్, ఎంపీటీసీ యద్దనపూడి చిన్నమ్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాయం వెంకటేశ్వరరెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. తొలుత గడప గడపకు తిరుగుతూ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందించారు. కార్యక్రమానికి వచ్చిన పార్టీ నాయకులు, అధికారులకు బీసీ కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ బోయిన వెంకటేశ్వర్లుయాదవ్, స్థానిక పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మేళతాళాలు, బాణ సంచా వెలుగుల్లో నాయకులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు సీహెచ్ కోటేశ్వరరావు, జేఏసీ కన్వీనర్ ఎస్వీ వెంకటరెడ్డి, కే గురవారెడ్డి, ఎస్ సుబ్బారెడ్డి, దొడ్డా ప్రసాద్‌రెడ్డి, బీ చిన్నబాలయ్య, నాగం కృష్ణయ్య యాదవ్, కే దిబ్బారెడ్డి, కొండారెడ్డి, కే తిరుపతిరెడ్డి, యం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురంలో...

మార్కాపురం: గడప గడపలో ఉన్న అక్కాచెల్లెమ్మలు సంతోషంగా ఉండడటమే జగనన్న లక్ష్యమని అందుకే నవరత్నాల పథకాలను ఇస్తున్నాడని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ద్వారా వచ్చిన ఆర్థిక ప్రయోజనాల లబ్ధిని వివరించారు. పింఛన్ల పంపిణీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి పథకాలతో అన్నివర్గాల ప్రజలకు అండగా ఉన్నారని చెప్పారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణం చేపడతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కౌన్సిలర్లు ఏ బాలచెన్నమ్మ, వార్డు ఇన్చార్జ్ పీవీ నాయుడు, పట్టణ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు మయూరి కాశీం, కమిషనర్ గిరికుమార్, పార్టీ నాయకులు బాబీ, శ్యాంసన్, లూకయ్య, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయం పరిధి మదవపల్లి, గోనపల్లి, పామూరుపల్లి గ్రామాల్లో ఆయన శుక్రవారం 114వ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే గ్రామాల్లోని వీధుల్లోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్ ప్రజలకు అందించి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఆయా వీధుల్లో స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అన్నా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు తోడుగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న చేయూత, జగనన్న తోడు, వైఎస్సార్ ఆసరా వంటి మహిళలు ఆర్థికంగా ఉన్నత స్థానంలో నిలిపే పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీని, తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకట నాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, నాయకులు ఏలూరి రమణయ్య, నాగేశ్వరరావు, అలెగ్జాండర్, ఎంపీడీఓ నరసయ్య, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, ఈవోఆర్‌డీ రాధాకృష్ణమూర్తి, ఎంఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి సహకరిస్తా

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: దివ్యాంగుల సంక్షేమానికి సహకరిస్తానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాల ఆవరణలో వైఎస్ ఆర్ సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి, కనిగిరి నియోజకవర్గాల దివ్యాంగులకు విర్కో ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో దివ్యాంగుల ఉచిత మెగా క్యాంప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. దివ్యాంగులకు సంక్షేమ పథకాలు అందేలా తన వంతు సహకారం అందిస్తానన్నారు. దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాలరెడ్డి నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా పర్యటించి మెగా క్యాంప్ గురించి అందరికీ వివరించి వారికి ఉచితంగా వినికిడి యంత్రాలు, వాకర్స్, చంక కర్రలు, హ్యాండ్ స్టిక్స్, బ్లైండ్ స్టిక్స్ ఇచ్చేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విర్కో ఫౌండేషన్, దాతల సహకారంతో సుమారు 300 మంది దివ్యాంగులకు వివిధ ఉపకరణాలు అందించినట్లు తెలిపారు. ఇందులో 80 మందికి కృత్రిమ అవయవాలు, 100 మందికి చెవి మిషన్లు, 40 వాకర్లు, 20 చంక కర్రలు, 15 బ్లైండ్ స్టిక్స్ తదితర ఉపకరణాలు ఇచ్చామన్నారు. దాతల సహకారాన్ని మర్చిపోమన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వ రాయితీలు అందేలా సహకారం అందించాలని కోరారు. అనంతరం ఉపకరణాలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, చైర్మన్ బాలమురళీకృష్ణ ద్వారా అందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం నాయకులు ఎల్ శేఖర్, ఎస్‌వీ రమణారెడ్డి, బాలచంద్రుడు, నరసింహారావుతో పాటు విర్కో ఫౌండేషన్ సీఈఓ ప్రవీణ, రెడ్‌క్రాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌బాబు, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కోలగట్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలి

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: క్రీడారంగంపై దృష్టి సారించి యువత ఉన్నత స్థాయికి ఎదగాలని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని తాటిచెర్లలో అన్నా మిత్ర బృందం ఆధ్వర్యంలో గిద్దలూరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ బ్యాట్ చేతపట్టి ఎమ్మెల్యే కొద్ది సేపు క్రికెట్ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత తమ టాలెంట్‌ను నిరూపించుకోవాలంటే ఇలాంటి చిన్న చిన్న టోర్నమెంట్‌లను వేదికలుగా చేసుకుని గుర్తింపు పొందాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తోందని, క్రీడారంగంపై నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి ఆర్థికంగా భరోసా ఇస్తోందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు బాదం వేణుగోపాల్, బొమ్మని వెంకటేశ్వర్లు, అలెగ్జాండర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

లోకాయుక్త ఉత్తర్వులు అమలు చేయాలి



మాట్లాడుతున్న దళిత నాయకులు

దర్శి: దర్శి నగర పంచాయతీ పరిధిలోని గ్రామ సర్వే నంబర్ 247,248,266లో ఎ9.30 సెంట్లు ఎరుకల కులానికి చెందిన పేదలకు లోకా యుక్త కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని ఎరుకల సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఇట్టా శ్రీనివాసరావు, దళిత నేత ప్రేమ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. లోకాయుక్త తమకు తీర్పు ఇస్తే ఇతరులు ఆ భూములు ఆక్రమించుకుని అమ్ముకుంటున్నారని, కోర్టు తీర్పు ప్రకారం తమకు పట్టాలు మంజూరు చేయాలని కొద్ది రోజులుగా ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుడారాలు వేసుకున్నారన్నారు. ఎస్టీలు అక్కడే వండుకుని తింటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎండ పెట్టు తగిలి పేరం అంకమ్మ, ఆవుల తిరుపతమ్మ, కండెల మునెమ్మ, దిగుడు కోటమ్మలు అస్వస్థకు గురి కాగా 108లో దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. 14 సంవత్సరాల క్రితం తీర్పు వచ్చినా ఇప్పటికీ తమకు పొజిషన్ ఇచ్చి పట్టాలు ఇవ్వలేదన్నారు. 2014 జులై 7వ తేదీన జడ్జి మెంట్ వచ్చినా అధికారులు స్పందించిక పోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలో నిరాహార దీక్షలు చేసి భూములు కాపాడుకున్నామని చెప్పారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తమకు, జర్నలిస్టులకు కలిపి అక్కడ పట్టాలు మంజూరు చేస్తామని విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చెప్పారన్నారు. పట్టాలు ఇచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని, సోమవారం నుంచి నివాసాల నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు. దళిత సేన నియోజకవర్గ అధ్యక్షుడు మార్కు, మాదిగ మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టుపల్లి ప్రసాద్, గుంటూరు ఏసుదాసు, గర్నెపూడి ప్రభాకర్, బండి రామాంజనేయులు, ఏకశిరి ఆంజనేయులు, బాధిత మహిళలు పాల్గొన్నారు.

5, 6వ తేదీల్లో బండ పందెం

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో భూలక్ష్మీ సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా జూన్ 5, 6వ తేదీల్లో రాష్ట్ర స్థాయి బండ పందెం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5న రెండు పండ్ల విభాగంలో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో, నాల్గోవ బహుమతులు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు అందజేస్తారు. 6వ తేదీన న్యూ కేటగిరీ విభాగంలో బండ పందెం జరుగుతుందన్నారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండో, మూడో, నాల్గో, ఐదో బహుమతులు వరుసగా రూ.50 వేలు, 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, 5 వేలను దాతలు అందజేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9849490257, 9133262194, 9959815290 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు స్వాగతించాలి



డ్రోన్‌తో పురుగుమందు పిచికారీని పర్యవేక్షిస్తున్న వ్యవసాయాధికారులు

గిద్దలూరు రూరల్: రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఆధునిక పద్ధతులు స్వాగతించాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని కెఎస్ పల్లె గ్రామ పంచాయతీ పరిధి ఉప్పలపాడులో శుక్రవారం డ్రోన్‌తో పురుగుమందు పిచికారీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. సాగు ఖర్చుతో పాటు సమయాన్ని సైతం తగ్గించుకునే పద్ధతి డ్రోన్ పురుగు మందు పిచికారీ అని రైతులు గుర్తించాలన్నారు. ఏఓ విజయభాస్కర్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాల కేంద్రాలను బలోపేతం చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ బాబూరావు



సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ బాబూరావు

ముండ్లమూరు: జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా మహిళల భాగస్వామ్యంతో నడుస్తున్న పాల కేంద్రాలను బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబూరావు సూచించారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ పథకంపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు 50 రాయితీపై ఇతర రాష్ట్రాల నుంచి గేదెల కొనుగోలుకు అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో పాల కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించినట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అమూల్ పాల కేంద్రాల ద్వారా ధరలు పెంచడంతో ప్రతి రైతుకు లాభం చేకూరిందన్నారు. పాడి పరిశ్రమపై ఆశక్తి ఉన్న వారికి పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రైవేట్ డెయిరీల కంటే అధిక ధరలు కల్పించామన్నారు. అవసరమైన ప్రతి మహిళకు బ్యాంకు, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి పథకం ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమూల్ పాల కేంద్రాలను సిబ్బంది, గ్రామ సంఘ సహాయకులు రోజూ ఉదయం, సాయంత్రం విజిట్ చేసి పాలు పోసే వారికి ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది పర్యవేక్షణ లేకుండా అకారణంగా పాల కేంద్రాలను మూతేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే వివిధ కారణాలతో మూతపడిన పాల కేంద్రాలను మళ్లీ ప్రారంభించాలన్నారు. మండలంలోని తూర్పుకంభంపాడు పాల కేంద్రానికి గతేడాది రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు రావడాన్ని గుర్తు చేశారు. చింతలపూడి, వేములబండ, పసుపుగల్లు, పులిపాడు, శంకరాపురం, పోలవరం, వేంపాడు, భీమవరం, కొమ్మవరం, ఉమామహేశ్వరపురం గ్రామాల్లో నిత్యం పర్యటించి పాల కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలన్నారు. సమావేశంలో ఏపీఎం హనుమంతరావు, సీసీలు గురవయ్య, డేవిడ్, అకౌంటెంట్ మార్తమ్మ ఉన్నారు.

మూడు సబ్సిడీ ట్రాక్టర్ల పంపిణీ



యంత్ర పరికరాలు పంపిణీ చేస్తున్న అధికారులు

దొనకొండ: వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా ఈ ఏడాది రైతులకు సబ్సిడీపై మూడు ట్రాక్టర్ల యంత్ర పరికరాలు మంజూరయ్యాయని వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. వాటిని శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. చందవరం వైష్ణవి రైతు మిత్ర గ్రూపునకు ఒక ట్రాక్టర్, 9 చెక్కల గొర్రు, ట్రాలీ, గుంటక బ్లేడు అందించారు. వాటి ఖరీదు రూ.10.85 లక్షలు కాగా సబ్సిడీ రూ.3.21 లక్షలు, కొచ్చెర్లకోట వీరాంజనేయ రైతు మిత్ర సంఘానికి ట్రాక్టర్, 9 చెక్కల గొర్రు, 3 తైవాన్ స్ప్రేయర్లు వాటి ఖరీదు రూ.11.16 లక్షలు కాగా సబ్సిడీ రూ.4.06 లక్షలు, శ్రీ వెంకటేశ్వర రైతు మిత్ర సంఘానికి ట్రాక్టర్, రోటావేటర్, గుంటక బ్లేడు, నాగలి ట్రక్కు, వాటి ఖరీదు రూ.13.19 లక్షలు కాగా సబ్సిడీ రూ.4.73 లక్షలు వర్తించిందని వ్యవసాయాధికారి తెలిపారు. ఇంకా కావాల్సిన రైతులకు మండలానికి రూ.12 లక్షలు మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.

జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష



మొక్కలు నాటుతున్న డీపీఓ నారాయణరెడ్డి

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి సమావేశంలో పాల్గొని అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. వీలైనంత త్వరలో నిర్మాణాలు చేపట్టాలని, అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా స్థానిక డంపింగ్ యార్డులో తయారైన వర్మీ కంపోస్ట్ ఎరువు పరిశీలించారు. తీగ జాతి మొక్కలు నాటించారు. పచ్చదనం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. స్థానిక జగనన్న కాలనీలు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఏపీఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, హౌసింగ్ సిబ్బంది, జెస్సీ గ్లోరీ పాల్గొన్నారు.

అటవీ అధికారుల ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, ఫారెస్ట్ అధికారులు

కంభం: అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మేరీ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణహిత జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ రవి మాట్లాడుతూ పర్యావరణానికి ప్లాస్టిక్‌తో ముప్పు పొంచి ఉందని, ప్రజలు వాటి వాడకాన్ని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. పర్యావరణహిత జీవనశైలిపై రెవెన్యూ సిబ్బందికి ఫారెస్టు అధికారులు అవగాహన కల్పించారు. సెక్షన్ ఆఫీసర్ ప్రభాకరరావు, బీట్ అధికారి సయ్యద్ ఇమ్రాన్, ఆర్‌ఐ శ్రీను, రెవెన్యూ, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.